నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, శుక్రవారం 15 నవంబర్ 2024 | PEDDAPALLI

విదేశాల్లో ఉద్యోగావకాశాలు

16న చిగురుమామిడిలో నమోదు

కరీంనగర్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) సంస్థ ఆధ్వర్యంలో 20 దేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగాలరాల శాఖ నుంచి రిజిస్టర్ అయిన రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా గ్రామీణ యువతకు విదేశాల్లో అద్భుతమైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఇంగ్లాండ్, అమెరికా, జర్మనీ, జపాన్, ఇజ్రాయెల్, గ్రీస్‌తోపాటు యూఏఈ సహా 20 దేశాల్లో హెల్త్ కేర్, నాన్ హెల్త్ కేర్ సెక్టార్లలోని పోస్టులను ఈ-డ్రైవర్‌లో భర్తీ చేయనున్నారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో రిజిస్టర్ నర్సు, వృద్ధుల సంరక్షణ నర్సు, హెల్త్ కేర్ అసిస్టెంట్, నాన్ హెల్త్‌కేర్ రంగంలో ఆటోమోటివ్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్, ఫుడ్ డెలివరీ సిబ్బంది, కార్పెంటర్లు, హాస్పిటాలిటీ (హౌస్ కీపింగ్, వెయిటర్లు, కిచెన్ స్టాఫ్, గార్డనర్), నిర్మాణ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఆయా దేశాల్లో ఉద్యోగాలు పొందే వారు అక్కడి భాషల్లో నైపుణ్యం సంపాదించుకోవడానికి శిక్షణ కూడా ఇవ్వనున్నారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్, ఐటీఐ, లేదా ఏదైనా డిగ్రీ, జీఎన్ఎం లేదా నర్సింగ్ వంటి అర్హతలతోపాటు సంబంధిత పని అనుభవం ఉన్న 18 నుంచి 45 ఏండ్ల వయసున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 16న చిగురుమామిడిలో నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారులు కోరారు. వివరాలకు 9849843658 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దేవాదాయ శాఖలో బది'లీలలు'!

- దేవాదాయ శాఖలో కొనసాగుతున్న డిప్యూటేషన్ల పర్వం
- రాజన్న కంటే, నరసింహుడి మీదనే అధికారులకు భక్తి
- వేములవాడ నుంచి యాదగిరిగుట్టకు మరో ఏఈవోకు డిప్యూటేషన్
- కొద్దిరోజుల క్రితమే దేవాదాయ శాఖ కమిషనర్‌కు స్థానచలనం
- కొత్త సారథి బాధ్యతలు చేపట్టకముందే ఉత్తర్వుల రాకపై ఉద్యోగవర్గాల్లో తీవ్ర చర్చ

ఏఈవో రమేశ్‌ను యాదగిరిగుట్టకు డిప్యూటేషన్ వేస్తూ దేవాదాయశాఖ కార్యాలయం నుంచి వెలువడిన ఉత్తర్వు

వేములవాడ, నవంబర్ 14: దేవాదాయశాఖలో బది'లీలలు' ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. తరచుగా వెలుగుచూస్తూనే ఉన్నాయి. ట్రాన్స్‌ఫర్లు పకడ్బందీగా చేపట్టామని రాష్ట్రస్థాయి అధికారులు చెబుతున్నా, అంతా ఇష్టారాజ్యంగా నడుస్తున్నట్లు తెలుస్తున్నది. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలు వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, కొండగట్టు, కొమురవెల్లి, బాసరను యూనిట్‌గా చేసి గత ఆగస్టులో దేవాలయ ఉద్యోగులను ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే దేవాదాయశాఖ అధికారులకు మాత్రం రాష్ట్రంలోని అన్ని ఆలయాలకంటే యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామినైనే భక్తి ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తున్నది. బదిలీల్లో భాగంగా వేములవాడ రాజన్న ఆలయానికి యాదగిరిగుట్ట నుంచి బదిలీపై వచ్చిన ఉద్యోగులను ఒక్కొక్కరిగా మళ్లీ అక్కడికే డిప్యూటేషన్‌పై పంపించడమే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఆగస్టులో వేములవాడలో పర్యవేక్షకుడిగా పనిచేసే రాజన్ బాబును యాదగిరిగుట్టకు, యాదగిరిగుట్టలో పర్యవేక్షకుడిగా విధులు నిర్వర్తిస్తున్న గోలి శ్రీనివాస్‌ను వేములవాడ ఎమ్మెల్యే పీఏగా నియమిస్తూ అప్పటి కమిషనర్ హన్మంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సెప్టెంబర్ 23న వేములవాడలో పర్యవేక్షకురాలు శ్రీలతను యాదగిరిగుట్టకు డిప్యూటేషన్‌పై పంపించారు. తాజాగా రాజన్న ఆలయ ఏఈవో రమేశ్‌బాబును యాదగిరిగుట్టకు డిప్యూటేషన్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు రెండ్రోజుల క్రితమే రాజన్న ఆలయ కార్యాలయానికి చేరుకున్నాయి. అయితే దేవాదాయశాఖ కమిషనర్‌గా ఉన్న హన్మంతరావు కొద్దిరోజుల క్రితమే కలెక్టర్‌గా బదిలీఅయ్యారు. ఆయన స్థానంలో మరో అధికారి హన్మంతును కమిషనర్‌గా నియమించినప్పటికీ, వయసు లేదనే కారణంతో అతడికి బాధ్యతలు అప్పగించలేదు. ఈ క్రమంలో మరో ఐఏఎస్ అధికారి శ్రీధర్‌ను ప్రభుత్వం నియమించగా, ఆయన బాధ్యతలు చేపట్టక ముందే ఏఈవో రమేశ్‌బాబు డిప్యూటేషన్ ఉత్తర్వులు వెలువడడం దేవాదాయశాఖ ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇది ఎలా సాధ్యమైందనేది? అంతుచిక్కని ప్రశ్నగా మారింది. బదిలీలు పకడ్బందీగా చేశామని చెబుతున్న ఆ శాఖ ఉన్నతాధికారులే డిప్యూటేషన్ల పర్వం కొనసాగిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది.

ప్రమోషన్లు పొందినా.. ఎదురుచూపులే

యాదగిరిగుట్ట మాతృ సంస్థగా ఉన్న పర్యవేక్షకుడు అశోక్ వేములవాడకు బదిలీ అయ్యాడు. అయితే యాదగిరిగుట్టలో సహాయ కార్యనిర్వాహణ అధికారి పోస్టు ఖాళీ కాగా, సీనియారిటీ ప్రకారం అశోక్‌కు 43 రోజుల కిందే పదోన్నతి వచ్చింది. ప్రస్తుతం వేములవాడ పీఆర్వో కార్యాలయంలో పర్యవేక్షకుడిగా పని చేస్తున్న ఆయనకు, పదోన్నతి ప్రకారం ఇక్కడా పోస్టింగ్ ఇవ్వక, మాతృ సంస్థకు పంపించకపోవడంతో పాత ఉద్యోగమే చేస్తున్నాడు. ఆయనతో పాటు మరికొందరు ఉద్యోగులదీ అదే పరిస్థితి. ఆయా ఆలయాల్లో సీనియారిటీ ప్రకారం పదోన్నతి పొంది, పాత ఉద్యోగాన్నే కొనసాగిస్తున్నారు. తమకు పదోన్నతి లభించిందని, బదిలీ అయిన చోట స్థానం లేదని ఇప్పటికే రాష్ట్ర దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అందుకు ఆయా దేవాలయాలు అధికారులు కూడా ధ్రువీకరిస్తూ తమ ఆలయంలో పదోన్నతి పొందిన వారిని వెనక్కి పంపాలని ప్రత్యుత్తరాలు జరిపారు. వాటిని మాత్రం అలానే పెండింగ్‌లో ఉంచి డిప్యూటేషన్లను ప్రోత్సహిస్తున్న తీరు ఉద్యోగ వర్గాల్లో అసహనానికి దారితీస్తున్నది.

మాస్టర్ ప్లాన్లపై గందరగోళం?

కరీంనగర్‌లో కార్పొరేషనా..? అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీనా..?

- ఏ ప్లాన్ అమలు చేస్తారన్న దానిపై అస్పష్టత
- పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి
- ఓవైపు మాస్టర్ ప్లాన్లకు కసరత్తు..
- మరోవైపు అర్బన్ డెవలమెంట్ అథారిటీలకు ఆదేశాలు
- ప్రభుత్వం నుంచి స్పష్టత కరువు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాస్టర్ ప్లాన్‌లపై గందరగోళం నెలకొంది. ఓవైపు కొత్త మాస్టర్ ప్లాన్స్‌కు కసరత్తు చేస్తున్న తరుణంలోనే.. మరోవైపు ప్రభుత్వం ఇటీవల నలుదిశలా నాలుగు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో భవిష్యత్‌లో ఏ ప్లాన్ అమలు చేస్తారన్న దానిపై అస్పష్టత ఏర్పడింది. కరీంనగర్‌లో సుడా పరిధిలో కొత్త మాస్టర్ ప్లాన్‌కు శరవేగంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తాజాగా అధికారులు ప్రకటించిన నేపథ్యంలో ప్రస్తుతం విస్తరించిన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిస్థితి ఏమిటీ.. దీని పరిధిలో ఏ ప్లాన్ అమలు చేస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇటు రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోనూ కొత్తగా మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు సిద్ధం కాగా.. రామగుండం కేంద్రంగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ప్రకటన చేయడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇక్కడా మాస్టర్ ప్లాన్‌పై అస్పష్టత ఉన్నది. ఇదే పరిస్థితి జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోనూ కనిపిస్తున్నది. సర్కారు నుంచి స్పష్టత లేకుండా ఏ నిర్ణయం తీసుకున్నా అది భవిష్యత్ తరాలకు ఇబ్బందిగా మారుతుందన్న చర్చ జరుగుతుండగా, పాలకవర్గాలకు, అధికారులకు కూడా ఏదీ అంతు పట్టకుండా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సుడా మాస్టర్ ప్లాన్ మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి (ఫైల్)

కరీంనగర్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కార్పొరేషన్ : ఉమ్మడి జిల్లాలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో కొత్త మాస్టర్ ప్లాన్స్ అనే అంశం తాజాగా తెరపైకి వస్తున్నది. నిజానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ పలు మున్సిపాలిటీల పరిధిలో కొత్త మాస్టర్ ప్లాన్ అమలుకు కసరత్తు చేసినా ఎన్నికలు రావడంతో అది వాయిదా పడింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కరీంనగర్, రామగుండం కార్పొరేషన్లతోపాటు జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల, మెట్‌పల్లి, ఇతర మున్సిపాలిటీల్లో కొత్త మాస్టర్ ప్లాన్ అమలుకు కసరత్తు చేసింది. ఆ మేరకు సమాచారం సేకరించడంతోపాటు కొన్ని ప్రతిపాదనలు తయారయ్యాయి. నిజానికి కొత్త మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలను ప్రజల ముందుంచి, అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించిన తర్వాత అమల్లోకి తేవాలి. ఆ దిశగా చర్యలు సాగుతున్నాయి. ఉదాహరణకు శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలో గతంలో కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు కొత్తపల్లి మున్సిపాలిటీ, అలాగే 72 గ్రామ పంచాయతీలకు కలిపి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకే కొంత కసరత్తు జరిగింది. ఇప్పటికే రెండు సార్లు ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. మరో రెండు సార్లు అభిప్రాయ సేకరణ తర్వాత ముసాయిదా మాస్టర్ ప్లాన్ విడుదల చేస్తారు. అందులోనూ అభ్యంతరాలు స్వీకరించి, అవి పరిష్కారం అయిన తర్వాతే ఫైనల్ మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయాలి. అందుకు సంబంధించి కసరత్తు శరవేగంగా జరుగుతున్నది. అలాగే రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ వంటి మున్సిపాలిటీల పరిధిలోనూ కొత్తగా మాస్టర్ ప్లాన్స్‌కు సంబంధించి ఇప్పటికే కొంత కసరత్తు పూర్తయింది. వాటిపై కూడా చర్చ సాగుతున్నది.

ఎన్నో అనుమానాలు

కొత్త మాస్టర్ ప్లాన్‌పై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉదాహరణకు చూస్తే గతంలో సుడా పరిధిలో కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు కొత్తపల్లి మున్సిపాలిటీ, 72 గ్రామ పంచాయతీలు ఉండేవి. ఇప్పుడు ప్రభుత్వం కొత్తగా హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీలతోపాటు 147 గ్రామాలను సుడా పరిధిలోకి తెస్తూ జీవోనంబర్ 188ను విడుదల చేసింది. అయితే ప్రస్తుత మాస్టర్ ప్లాన్‌ను గత సుడా పరిధి మేరకే తయారు చేస్తున్నారు. ఇలా అమలు చేస్తే కొత్తగా తెచ్చిన అర్బన్ అథారిటీ పరిధి పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకసారి అర్బన్ అథారిటీ ఏర్పాటైతే.. దాని పరిధి మొత్తానికి ఒకే రకమైన మాస్టర్‌ప్లాన్ అమలు చేయాల్సి ఉంటుంది. అలా చేస్తే ప్రస్తుతం రూపొందిస్తున్న సూడా మాస్టర్‌ప్లాన్ పనిచేయకుండా పోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాదు కేవలం సుడా వరకే మాస్టర్ ప్లాన్ అమలైతే మరి అర్బన్ అథారిటీ పరిధిలోకి వచ్చిన మిగిలిన గ్రామాల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అర్బన్ అథారిటీగా ముద్ర పడిన తర్వాత పంచాయతీ నిబంధనల ప్రకారం అనుమతులు ఇవ్వడానికి వీలులేదని తెలుస్తున్నది. అందుకే సుడా మాస్టర్‌ప్లాన్‌పై అనేక అనుమానాలే కాదు, అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. లేదు సుడా మాస్టర్ ప్లాన్‌ను అర్బన్ అథారిటీ పరిధి మొత్తం అమలు చేస్తే అంత పెద్ద రోడ్లు, ఇతర అంశాలు గ్రామాల్లో సాధ్యం అవుతాయా..? లేదా అన్న చర్చ జరుగుతున్నది. అలాగే జగిత్యాల మున్సిపాలిటీకి గతంలోనే మాస్టర్ ప్లాన్ తయారు చేశారు. దీనిపై వివాదం తలెత్తడంతో నిలిపివేశారు. ఈ పరిస్థితుల్లో జగిత్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పేరిట ప్రభుత్వం ఐదు మున్సిపాలిటీలు, 294 రెవెన్యూ గ్రామాలను కలుపుతూ జీవో విడుదల చేసింది. ఇక్కడ కరీంనగర్‌లో ఉత్పన్నమయ్యే ప్రశ్నలే వ్యక్తమవుతున్నాయి. అలాగే వేములవాడ ఆలయ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన వేములవాడ ఆలయ ఏరియా అభివృద్ధి ప్రాధికార సంస్థ (వీటీడీఏ) పరిధిని రాజన్న సిరిసిల్ల మొత్తానికి వర్తింప చేస్తూ జీవో నంబర్ 184ను ప్రభుత్వం విడుదల చేసింది. గతంలో వీటీడీఏ పరిధిలో వేములవాడ అర్బన్ మండలంలోని 11 గ్రామాలతోపాటు వేములవాడ పురపాలక సంఘం మాత్రమే ఉండేది. ఇప్పుడు కొత్తగా సిరిసిల్ల మున్సిపాలిటీతోపాటు వేములవాడ రూరల్, బోయినపల్లి, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మండలాల్లోని 152 రెవెన్యూ గ్రామాలను వీటీడీఏ పరిధిలోకి తీసుకొచ్చారు. అలాగే రామగుండం కార్పొరేషన్ కేంద్రగా రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పేరుతో ప్రభుత్వం జీఓనంబర్ 165ను జారీచేసింది. ఈ పరిధిలోకి పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలతోపాటు 198 గ్రామాలను తీసుకొచ్చింది. రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి మున్సిపాలిటీలకు గతంలో తయారు చేసిన మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనల ప్రకారమే ముందుకు వెళ్తారా? లేక అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధికి కలిపి కొత్తది తయారు చేస్తారా..? అన్నదానిపై అస్పష్టత నెలకొంది.

అంతా అస్పష్టత?

అర్బన్ డెవలప్‌మెంట్ పేరిట జీవోలు జారీ చేసిన ప్రభుత్వం.. వాటి పరిధిలో విధి విధానాలు, తీసుకోవాల్సిన నిర్ణయాలు, వాటి స్వరూపం వంటి అంశాలపై మాత్రం నేటికి స్పష్టత ఇవ్వలేదు. దాదాపు 90 శాతం గ్రామాలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలోకి తెస్తూ ఉత్తర్వులు ఇచ్చినా.. ఆ పరిధిలోని పంచాయతీల్లో ఏ ప్లాన్ అమలు చేయాలన్నది చెప్పలేదు. అంతేకాదు, అర్బన్ అథారిటీ పరిధిలోని గ్రామాల్లో పంచాయతీలుంటాయా..? ఉండవా..? అన్నది తెలుపలేదు. ఒకవేళ పంచాయతీలుంటే అప్పుడు పంచాయతీ రాజ్ చట్టాన్ని అనుసరించి మాత్రమే అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ లెక్కన చూస్తే మాస్టర్ ప్లాన్ ప్రభావం అంతంత మాత్రంగానే ఉండనుంది. ఈ విషయంలో అధికారయంత్రాగానికి సైతం పూర్తి స్పష్టత రావడం లేదు. ప్రభుత్వం నుంచి విధి విధానాలు రాకముందు ఏ నిర్ణయం తీసుకున్నా.. అది మళ్లీ మొదటికే వస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు, అధికారయంత్రాగం శ్రమ వృథా అవ్వడంతోపాటు అస్పష్టతతో ప్లాన్లు సిద్ధం చేస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరొస్తుందన్న అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో అస్పష్టతకు తెరదించాలంటే అది ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుంది. క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న అనుమానాలు, ఇతర అంశాలను పరిగణిలోకి తీసుకొని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలపై పూర్తి స్థాయి క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం కనిపిస్తున్నది.

గ్రూప్-3 పరీక్షల హెల్ప్‌లైన్ నంబర్ల విడుదల

కరీంనగర్ కలెక్టరేట్, నవంబర్ 14 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షల్లో ఇబ్బందులెదుర్కొనే అభ్యర్థుల కోసం జిల్లాల వారీగా హెల్ప్‌లైన్ నెంబర్లను టీజీపీఎస్సీ గురువారం విడుదల చేసింది. ప్రధానంగా హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌లో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించేందుకు చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా హెల్ప్‌లైన్ నెంబర్లు అందుబాటులోకి తెచ్చినట్టు టీజీపీఎస్సీ అధికారులు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో కరీంనగర్ అభ్యర్థులు 0878-2997247, రాజన్న సిరిసిల్ల అభ్యర్థులు 9398684240, జగిత్యాల అభ్యర్థులు 9666234383, పెద్దపల్లి అభ్యర్థులు 7995970699 అనే నెంబర్లలో సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

కేడీసీసీబీకి ఆలిండియా ఫస్ట్ బెస్ట్ అవార్డు

కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

విద్యానగర్, నవంబర్ 14 : కరీంనగర్ డీసీసీబీ 2023-24 సంవత్సరం పనితీరుకు నాఫ్స్‌కాబ్ అఖిల భారత మొదటి ఉత్తమ డీసీసీబీ అవార్డును అందుకున్నదని కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తెలిపారు. కరీంనగర్‌లోని 71వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా గురువారం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో కో ఆపరేటివ్ జెండాను ఆయన ఎగురవేసి, వేడుకలను ప్రారంభించారు. కేంద్ర సహకార మంత్రిత్వశాఖ చేపట్టిన అనేక కార్యక్రమాల్లో కేడీసీసీబీ పీఏసీఎస్‌లు అనేక కార్యక్రమాలు చేయడంలో ముందున్నాయన్నారు.

జెండావిష్కరిస్తున్న కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

సీఈవో సత్యనారాయణరావు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి ఆల్‌రౌండ్ పని తీరుకు ఈ అవార్డు పొందిందన్నారు. ప్రొఫెషనల్ డైరెక్టర్ గోపాల్ మాట్లాడుతూ వినియోగదారుల విశ్వాసాన్ని సహకరించడంలో నిజాయితీ చాలా ముఖ్యమని, కష్టపడి చేయడం వల్ల బ్యాంకు పురోగతితో పాటు ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పింగలి రమేశ్, డైరెక్టర్ రాంచంద్రారావు, మందాడి సాగర్, అలువాల్ కోటయ్య, భూపతి, సురేందర్, ఎల్లంకి రమేశ్, డీసీవో రామానునాచార్య, డీఆర్‌వో ఎస్‌డీ రాంమోహన్, ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంటేనే మోసం

- ఆరు గ్యారెంటీలని నమ్మించి అధికారంలోకి వచ్చింది
- ఇలానే మహారాష్ట్ర ప్రజలను దగా చేయాలని చూస్తున్నది
- వందలాది కోట్ల ప్రజాధనంతో అక్కడ తప్పుడు ప్రకటనలు
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజం
- మంథనిలో 'కాంగ్రెస్ ప్రజా వంచన దినాలు' నిరసన కార్యక్రమాలు ప్రారంభం

మంథని: గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, నవంబర్ 14: 'కాంగ్రెస్ అంటేనే మోసం. ఎన్నికల ముందు ఇక్కడి ప్రజలను మభ్యపెట్టింది. ఆరు గ్యారెంటీలు అని, 420 పథకాలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు మహారాష్ట్రలోనూ ఇలానే మోసం చేయాలని చూస్తున్నది' అని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజమెత్తారు. తెలంగాణలో గ్యారెంటీలు విజయవంతంగా అమలు చేస్తున్నామంటూ కోట్లాది రూపాయల ప్రజాధనంతో ఆ రాష్ట్ర పేపర్లలో తప్పుడు ప్రకటనలిస్తున్నదని మండిపడ్డారు. పథకాల అమలుపై గ్రామాల్లోకి వచ్చే ఆ పార్టీ నాయకులకు ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. పథకాల పేరిట రాష్ట్ర ప్రజలను నయవంచనకు గురి చేసిన ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా 'కాంగ్రెస్ ప్రజావంచన దినాలు' పేరిట ఈ నెల 14 నుంచి వచ్చే నెల 9 వరకు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలను గురువారం మంథని పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద ప్రారంభించారు. రాజ గృహ నుంచి కొంత దూరం పాటు నాయకులతో కలిసి బీఆర్ఎస్ జెండాలు చేతపట్టుకొని ర్యాలీగా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం కాంగ్రెస్ మోస పూరిత విధానాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడారు. ఎన్నికలప్పుడు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల అమలును పూర్తిగా విస్మరించిందన్నారు. ముఖ్యంగా ఆడబిడ్డలకు నెలకు ₹2500 ఇస్తామని, ఇందిరాగాంధీ, మహాత్మాగాంధీ ఫొటోలు పెట్టుకుని మ్యానిఫెస్టో చూపించి దగా చేశారన్నారు. ఆడబిడ్డలకు ఆశపెట్టి మోసం చేసిన చరిత్ర దేశంలోనే కాంగ్రెస్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. ఆనాడు మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా మంథని ఎమ్మెల్యేనే పనిచేశారని, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికే ఒక్క పథకం కూడా అందకపోవడం చాలా బాధాకరమన్నారు. మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ సొంత నియోజకవర్గానికే పథకాలు రాకుండా రాష్ట్రంలోని ప్రజలకు ఎలా వస్తాయని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, అగ్రవర్ణాలకు చెందిన ప్రజలు చదువుకున్న వ్యక్తి న్యాయం చేస్తాడని ఓట్లు వేసి గెలిపిస్తే, నియోజకవర్గ ప్రజలకు ఒక్క పథకాన్ని కూడా తీసుకురాకపోవడం నిజంగా బాధాకరమన్నారు. తెలంగాణ ప్రజలను ఆరు గ్యారెంటీలతో మోసం చేసిన విధంగానే మహారాష్ట్ర ప్రజలను మోసం చేయాలని కాంగ్రెస్ చూస్తున్నదన్నారు. అందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో ఆరు గ్యారెంటీ పథకాలు అమలవుతున్నాయని అక్కడి పేపర్లలో కోట్లాది రూపాయల ప్రజాధనంతో తప్పుడు ప్రకటనలు చేస్తూ, ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పని తీరుపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కొడంగల్‌లో జరిగిన సంఘటనపై బీఆర్ఎస్‌ను బద్నాం చేయడమే అందుకు నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సైతం కేసులో ఇరికించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పక్షంలో ఉన్న తమ వద్దకు ప్రజలు వస్తుంటారని, వారి సమస్యలపై పోరాటం చేయడం సహజమేనన్నారు. అంతమాత్రానికే కేసుల్లో ఇరికించాలని చూస్తారా..? అని ప్రశ్నించారు. కేసులతో బెదిరించాలని చూస్తే భయపడేవారు ఎవరూ లేరన్నారు. కాంగ్రెస్ విధానాలను ఎండగడుతూ, హామీల మోసాన్ని ప్రజలకు తెలిసేలా నియోజకవర్గంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ ప్రజావంచన నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు ఎగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, మాచీడి రాజుగౌడ్, ఎక్కటి ఆనంతరెడ్డి, మంథని లక్ష్మణ్, గొబ్బూరి వంశీ, వెల్చుల గట్టయ్య, కనవేన శ్రీనివాస్, ఎరుకల రవి, సెగ్గెం రాజేశ్, బెల్లంకొండ ప్రకాశ్‌రెడ్డి, ఉడత లింగయ్య, ఆకుల రాజబాపు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగిన ప్రదేశంలో నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు

రైళ్ల రాకపోకలు మొదలు

- కన్నాల వద్ద శరవేగంగా పూర్తయిన పునరుద్ధరణ పనులు
- అందుబాటులోకి మూడు ట్రాక్‌లు
- యథాతథంగా నడిచిన రైళ్లు

పాలకుర్తి, నవంబర్ 14: కన్నాల మీదుగా రైళ్ల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. 48గంటల్లోనే ట్రాక్‌ల పునరుద్ధరణ పనులు పూర్తి కావడంతో యథాతథంగా నడిచాయి. మంగళవారం అర్ధరాత్రి పెద్దపల్లి మండలం రాఘవాపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో కన్నాల వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ఘటనలో మూడు ట్రాకులు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రైల్వే అధికారులు, సిబ్బంది, కార్మికులు ముమ్మరంగా శ్రమించారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. బుధవారం రాత్రి వరకు రెండు ట్రాకులు అందుబాటులోకి తెచ్చి ట్రయల్‌రన్ చేశారు. రాఘవాపూర్ నుంచి రామగుండం వరకు, రామగుండం నుంచి రాఘవాపూర్ వరకు నడిపించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి 300 మీటర్ల మేర దెబ్బతిన్న ఎలక్ట్రికల్ వ్యవస్థ, సిగ్నలింగ్ సిస్టమ్‌ను గురువారం తెల్లవారుజామున పునరుద్ధరించారు. అంతా సజావుగా ఉండడంతో రాకపోకలను ప్రారంభించారు. సుమారు 60 ఎక్స్‌ప్రెస్‌రైళ్లు, గూడ్స్‌రైళ్లు నడిపించారు. అయితే ప్రమాదస్థలానికి 10 కిలోమీటర్ల దూరం నుంచే అన్ని రైళ్లను పరిమిత వేగం (20కిలోమీటర్ పర్ అవర్)